క్లుప్తంగా

'నిందితులపై చర్యలు తీసుకోవాలి'


పొట్టి శ్రీరాములు విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న సంఘ సభ్యులు

విజయనగరం: కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ఆంధ్రరాష్ట్ర పిత, అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహంపై చెత్త వేసి అపచారానికి పాల్పడిన నిందితులపై చర్యలు తీసుకోవాలని అమరజీవి ఫౌండేషన్ ప్రతినిధి ఆలవెల్లి శేఖర్ డిమాండ్ చేశారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడును గౌరవించుకోవాలన్నారు. విగ్రహంపై చెత్త వేయడం దారుణమని, వెంటనే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం నగరంలో గల పొట్టి శ్రీరాముల విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి సముద్రాల నాగరాజు, కోశాధికారి డిమ్స్ రాజు, వైస్ ప్రెసిడెంట్ మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల నిరసన


సీపీ ఆక్వాపరిశ్రమ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మిక కుటుంబాలు

పూసపాటిరేగ: తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కార్మిక కుటుంబాలు గైతులు చోడవరం సీపా ఆక్వా పరిశ్రమ వద్ద సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కార్మిక నాయకుడు నల్ల అప్పలరాజు ఆధ్వర్యంలో కార్మికులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తొలగించిన 48 మంది కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పరిశ్రమలో ఉన్న ప్రభుత్వ భూమిని అధికారులు స్వాధీనం చేసుకోవాలన్నారు. నిరసన సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భోగాపురం ఎస్సై కృష్ణమూర్తి బందోబస్తు నిర్వహించారు.

వర్ధంతి సభలు విజయవంతం చేయండి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ నాయకులు

నెల్లిమర్ల: జూట్ మిల్లు కార్మిక అమరవీరుల 30వ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.గీత పిలుపునిచ్చారు. ఈ మేరకు జరజాపుపేటలోని అమరవీరుల స్తూపం వద్ద సోమవారం కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇఫ్ట్యూ జిల్లా ఉపాధ్యక్షుడు కాళ్ల తిరుపతి, నాయకులు సింహాచలం, వెంకటలక్ష్మి, పార్వతి, వి.మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం దగ్ధం


దగ్ధమైన ద్విచక్రవాహనం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట నుంచి దన్నానపేట వెళ్లే రహదారిలో ఓ ద్విచక్రవాహనం దగ్ధమైంది. ఈ ఘటన ఆదివారం అర్ధరాత్రి సుమారు 11గంటల సమయంలో జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ద్విచక్రవాహనం ఆనవాళ్లు లేకుండా పూర్తి స్థాయిలో కాలి బూడిద కావడం పలు అనుమానాలకు తావినిస్తోంది. షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైందా? కావాలనే ఎవరైనా దగ్ధం చేశారా? అనేది తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎటువంటి ఫిర్యాదు నమోదు కాలేదు.

పరిశీలన


ఎంపీపీ, అధికారులతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి

విజయనగరం రూరల్: ఎంపీడీఓ కార్యాలయం సమీపంలో ఉన్న మండల సమాఖ్య భవనాన్ని డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి సోమవారం పరిశీలించారు. భవనానికి మరమ్మతులు చేపట్టడానికి అంచనా వ్యయం రూపొందించాలని మండల పీఆర్ ఇంజినీర్ గణేష్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పీడీతో మాట్లాడుతూ.. భవన మరమ్మతులతో పాటు ఖాళీ స్థలంలో కల్యాణ మంటపం నిర్మాణానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్డీ డి.తిరుపతినాయుడు, వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఓ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

దినదినాభివృద్ధి..

విజయనగరం... చారిత్రాత్మక ప్రాంతం. ఇక్కడి ఉన్న ప్రతీ ప్రదేశం, కూడలి ఓ ప్రత్యేకం. చారిత్రక వైభవాన్ని కాపాడుతూనే ప్రస్తుత ప్రభుత్వం కొత్తసొబగులు అద్దుతోంది. చారిత్రక ఘట్టాలతో కూడళ్లను అందంగా, ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతోంది. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని నింపుతోంది. దీనికి మూడులాంతర్ల కూడలి నిలువెత్తు నిదర్శనం. నాడు–నేడు అనేలా విద్యలనగర వైభవం ఉట్టిపడుతోంది. – సాక్షిఫొటోగ్రాఫర్, విజయనగరం


మూడులాంతర్లు పాత చిత్రం



అనంతర కాలంలో పరిస్థితి..


అభివృద్ధి చెందిన తర్వాత ఇలా..

ప్రతి ఇంటికీ సంక్షేమం


లబ్ధిదారులకు బుక్‌లెట్లు పంపిణీ చేస్తున్న డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

- డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. నగరంలోని మూడో డివిజన్‌లో అంబేడ్కర్ జంక్షన్ నుంచి సోమవారం ప్రారంభమైన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు అమలుపై ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ఏ ప్రాంతానికి వెళ్లినా ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా కోలగట్ల వీరభద్రస్వామి మరోసారి గెలిపించినట్లయితే సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతాయన్నారు. నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశారని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మెండా రమణ, వేముల రాంప్రసాద్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

సీతం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు


ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో కరస్పాండెంట్, తదితరులు

విజయనగరం అర్బన్: సీతం ఇంజినీరింగ్ కళాశాలలో గడిచిన విద్య సంవత్సరంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 28 మంది విద్యార్థులకు సోమవారం పురస్కారాలు అందజేశారు. మజ్జి రామారావు, బొత్స గురునాయుడు మెమోరియల్ స్కాలర్‌షిప్ – 2024 పేరుతో పురస్కారాలు అందజేశారు. కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సత్యా విద్యాసంస్థల సెక్రటరీ, కరస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మి, కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, మజ్జి అనురాధ, బొత్స పూజిత, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆసరా సంబరాలు

నెల్లిమర్ల: నియోజకవర్గ కేంద్రం నెల్లిమర్లలోని థామస్‌పేట ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో డ్వాక్రా రుణమాఫీ ఆసరా సంబరాలు మంగళవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు సభా ప్రాంగణాన్ని వైఎస్సార్ సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు హాజరవుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కారుకొండ వెంకటకృష్ణారావు, చిక్కాల సంతోష్‌కుమార్, నౌపాడ శ్రీనివాసరావు, మద్దిల వాసు, నల్లి శ్రీను, బూర సత్యనారాయణ, మజ్జి గణేష్,పైల మురళి, లెంక గోవింద్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ స్టార్టప్స్‌ను ప్రోత్సహించాలి

- పల్సస్ సీఈఓ డాక్టర్ శ్రీనుబాబు

డెంకాడ: వ్యవసాయ స్టార్టప్స్ నెలకొల్పడంతో పల్లెలు కూడా పురోగతి చెందుతాయని పల్సస్ సీఈఓ డాక్టర్ గేదెల శ్రీనుబాబు అన్నారు. లెండి కళాశాలలో ఇన్నోవేషన్ ఇంక్యుబేషన్ సెల్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టార్టప్స్ ద్వారా స్థానిక సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. ప్రతి విద్యార్థీ మేనేజ్‌మెంట్ స్కిల్, మార్కెటింగ్ టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మరో ముఖ్య అతిథి కవిత సిరుగుడి మాట్లాడుతూ.. కెరీర్, గోల్, అభిరుచులను తెలుసుకుని సమాజాభివృద్ధికి దోహదపడాలని విద్యార్థులకు హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపాల్ రామారెడ్డి మాట్లాడుతూ, వ్యవసాయ ఆధారిత స్టార్టప్స్‌ను నెలకొల్పడంతో వారి ప్రాంత వారికి ఉపాధి అందించవచ్చునన్నారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెల్ నిర్వాహకులు డాక్టర్ ఏవీ పరాంకుశం, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ సెల్ నిర్వాహకుడు డాక్టర్ పి.తిరుమల, కో ఆర్డినేటర్ డాక్టర్స్ వరప్రసాద్, వినోద్‌కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ టి.హరిబాబు, పలు విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనుబాబు


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: కలెక్టరేట్ సబ్ స్టేషన్‌లో అన్ని విభాగాల నిర్వహణతో పాటు 11 కేవీ బాలాజీ మార్కెట్ ఫీడర్, 11 కేవీ ఈస్ట్‌కోస్టు ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగించనున్నందున మంగళవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ పూడి హరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న పావనీనగర్, అరుంధతినగర్, కాంబోయి వీధి, రెల్లివీధి, గణేష్ కోవెల రోడ్, హోటల్ షాలిమార్, చెన్నారెడ్డి కాలనీ, సిక్కుల కాలనీ, రామయ్యమ్మ కాలనీ, బీసీ కాలనీ, యాతపేట, జర్నలిస్ట్ కాలనీలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పరామర్శ


నివాళులర్పిస్తున్న ఎస్‌టీయూ ప్రతినిధులు

విజయనగరం అర్బన్: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు మాతృమూర్తి మంగమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో ఎస్‌టీయూ సంఘ ప్రతినిధులు నగరంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం పరామర్శించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జోగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్, జిల్లా కార్యవర్గ సభ్యులు రవి, చిట్టిబాబు, అడివయ్య, తదితరులు మంగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అట్రాసిటీ చట్టంపై అవగాహన అవసరం

శృంగవరపుకోట: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని విశాఖపట్నం సీఐడీ డీఎస్పీ కుమారస్వామి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఎస్.సోమేశ్వరరావు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీలకు పీఓఏ యాక్ట్‌పై సోమవారం ఒక్కరోజు అవగాహన శిబిరం నిర్వహించారు. ముఖ్యవక్తగా హాజరైన డీఎస్పీ కుమారస్వామి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు సామాజిక, ఆర్థికం రంగాల్లో సమాన అవకాశాలు పొందేందుకు, సామాజిక న్యాయం అందించేందుకు, ఈ చట్టాన్ని రూపొందించారని చెప్పారు. ఎస్టీ, ఎస్టీల న్యాయపరమైన హక్కులకు భంగం కలిగించడం, అసత్య నేరారోపణలు, అక్రమ కేసులు బనాయించడం, ఇరికించడం వంటివి నేరాలుగా పరిగణిస్తారన్నారు. ఎస్సీ నాయకులు కె.జయశంకర్, గణేష్ మాట్లాడుతూ అధికారుల తీరుతో అట్రాసిటీ చట్టం నీరుగారుతోందని ఆరోపించారు. కేసుల విచారణలో జాప్యమవుతోందని కేత వీరన్న చెప్పారు. ఎస్.కోట సర్పంచ్ సంతోషికుమారి, తహసీల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిపై బాబా ఆశీస్సులు


దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మహోన్నత ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన హజరత్ సయ్యద్ ఢంకేషా వలి బాబా ఆశీస్సులు ప్రతి ఒక్కరిపైనా ఉండాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆకాంక్షించారు. బాబా 307వ గంధ మహోత్సవంలో భాగంగా సోమవారం దర్గాను సందర్శించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా కోలగట్లకు దర్గా ముతావల్లి షేక్ బహదూర్ (చోటా) సంప్రదాయంబద్ధంగా స్వాగతం పలికి సత్కరించారు.బాబాను దర్శించుకున్న అనంతరం కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, ఎంతో చరిత్రాత్మకమైన దర్గా పరమత సహనానికి నిదర్శనంగా నిలుస్తోందన్నారు. మతసామరస్యానికి ప్రతీకగా హిందూ, ముస్లింలందరూ బాబాను దర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో షేక్ సిద్దిక్, యర్ధాని, షేక్ షాజహాన్, షేక్ ఇస్మాయిల్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పెన్షన్‌దారులు

- ప్రభుత్వ పెన్షనర్ల సంఘం డిమాండ్

విజయనగరం అర్బన్: పెన్షన్‌దారులకు వివిధ రూపాల్లో పెండింగ్‌లో ఉండిపోయిన వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని కోరుతూ పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. పెన్షన్‌దారుల సంఘ రాష్ట్ర కమిటీ మేరకు నిర్వహించిన ధర్నాలో జిల్లా ప్రతినిధులు పలువురు మాట్లాడుతూ, జూలై 2018 నుంచి పెంచిన వేతనాలకు సంబంధించిన డీఏ ఎరియర్స్ విడుదల చేయాలని కోరారు. 2022 జనవరి నుంచి అమలు చేసిన 11వ పీఆర్‌సీ తాలూకా ఎరియర్స్ కూడా ఇంతవరకు చెల్లించలేదని వాపోయారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ పరిధి రూ. 2 లక్షల నుంచి ఐదు లక్షల రూపాయలకు పెంచాలని కోరారు. అనంతరం డీఆర్‌ఓ అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పెద్దింటి అప్పారావు, జిల్లా కార్యదర్శి ఎన్.నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు జీఆర్ రాఘవరాజు, విజయనగరం తాలూకా కమిటీ అధ్యక్షుడు వి.సూర్యనారాయణ, కార్యదర్శి సీహెచ్.త్రినాథ్ ప్రసాద్, వి.సత్తిరాజులునాయుడు, ఎం.సూర్యనారాయణ, ఎస్.లక్ష్మణరావు, కేఎం సంజీవరావు, సీఎస్ఆర్ రామానుజులు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

పూసపాటిరేగ: మండలంలోని పసపాం గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 100 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ కె.సురేష్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, మద్యం బాటిళ్లు పేరాపురం మద్యం షాపు నుంచి వచ్చినట్లు గుర్తించామని, దీంతో సేల్స్‌మన్ తీరుపై ఉన్నతాధికారులకు నివేదిస్తామన్నారు. నిందితుడు ఒమ్మి భోగిరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీల్లో భోగాపురం ఎస్సై శ్రావణ్‌కుమార్, ఎస్ఈబీ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రైవర్లకు కంటి పరీక్షలు

- ఆర్టీఓ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించిన డీటీసీ రవీంద్రనాథ్


ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న డీటీసీ రవీంద్రనాథ్

విజయనగరం క్రైమ్: వాహన డ్రైవర్లందరూ క్రమం తప్పకుండా కంటిచూపు పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ జీఆర్.రవీంద్రనాథ్ సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా ఆర్టీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 82 మంది వాహన డ్రైవర్లకు ఆరోగ్య పరీక్షలు, కంటి చూపు పరీక్షలను వైద్యులు ఉచితంగా నిర్వహించారు. కంటిచూపుతో బాధపడుతున్న 18 మందికి కళ్లజోళ్లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో వెంకటేశ్వర పుష్పగిరి వైద్యులతో పాటు ఆర్టీఓ ఎస్.రమేష్, ఎంవీఐ ఎ.వి.రమణ, యు.దుర్గాప్రసాద్, కేఆర్ఎస్.ప్రసాద్, వి.శ్రావ్య, వి.ఐశ్వర్యలక్ష్మి, కార్యాలయ పరిపాలనాధికారిణి డి.మంజుల, రోడ్డు భద్రత డాక్టర్ జి.సాయికుమార్, ఎమ్.శ్రీధర్, కార్యాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.